ఒకరికి రెండు టికెట్లు

- 19 ఎంపీ రూట్ బస్సులో ఆర్టీసీ కండక్టర్ నిర్వాకం
- ప్రశ్నించిన మహిళలు
- ప్రభుత్వానికి నష్టం చేసేందుకేనని ప్రయాణికుల ఆరోపణ



కండక్టర్ ఇచ్చిన రెండేసి టికెట్లు

19 ఎంపీ నెంబర్ బస్సులో ప్రయాణికులు



నిజాంపేట్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీకి లాభం చేకూర్చేందుకు, ప్రభుత్వానికి నష్టం కలిగించేందుకే ఇలా చేస్తున్నారని పలువురు మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కూకట్‌పల్లి, కాకతీయహిల్స్‌లో నివాసముంటున్న శారద గురువారం 19 ఎంపీ నెంబర్ బస్సులో ఎక్కింది. ఆధార్ కార్డు చూపగానే కండక్టర్ రెండు జీరో టికెట్లు ఇచ్చాడు. ఒక్క దానికే రెండు టికెట్లు ఎందుకిచ్చావని కండక్టర్‌ను అడగగా ఇంకా ఎవరైనా ఎక్కితే చూపించవచ్చని అన్నాడు. శారద బస్సులో మిగిలిన వారిని అడగగా తమకూ రెండు టికెట్లు ఇచ్చినట్లు చెప్పారు. బస్సులో ప్రయాణిస్తున్న నలుగురైదుగురు మహిళలు ఇలా ఎందుకిస్తున్నావని కండక్టర్‌ను అడగగా జీరో టికెట్లే కదా.. మీకేం నష్టం లేదు కదా.. అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడు. రెండు టికెట్లు ఇస్తున్నది ప్రభుత్వానికి నష్టం చేయడానికా అని ప్రశ్నించగా ఇంత నిజాయితీ మీకు పనికి రాదంటూ దురుసుగా సమాధానమిచ్చాడు. రెండు స్టాపుల దూరానికి టికెట్ తీసుకుంటే, వచ్చే స్టాప్‌కు కూడా టికెట్ ఇస్తున్నట్టు మరో మహిళ చెప్పింది. తాను రోజూ బస్సులో ప్రయాణం చేస్తానని, ఇలానే జరుగుతుందని, కండక్టర్‌తో గొడవ ఎందుకని సర్దుకుపోతున్నట్టు ఆమె చెప్పింది. ఒక్కొక్కరికీ రెండు టికెట్లు ఇచ్చి ప్రభుత్వం ద్వారా ఆ డబ్బు రాబట్టుకోవడానికే ఆర్టీసీ అధికారులు ఇలాంటి కార్యక్రమానికి పాల్పడుతున్నట్టు శారద ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆమె కోరారు.

'కాళేశ్వరంపై కేటీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం'

హైదర్‌నగర్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, న్యాయవాది సిందం శ్రీకాంత్ అన్నారు. ఇటీవల జరిగిన బీఆర్ఎస్ సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. ఈసారి ఎండాకాలం నీళ్ల లేకపోతే ప్రజలకు కేసీఆర్ గుర్తొస్తాడన్ని వ్యంగ్యంగా మాట్లాడటం హాస్యాస్పదమని శ్రీకాంత్ పేర్కొన్నారు. 2020-2023 వరకు నాలుగు సార్లు నోటీసులు ఇచ్చిన ప్రాజెక్టు అథారిటీ పట్టించుకోలేదని పేర్కొందని తెలిపారు. అప్పుడు నిద్రపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం వారి నాయకులు ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించడానికి ఇలాంటి వాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇకనైనా చౌకబారు రాజకీయాలు మానుకోవాలని హితవుపలికారు.



ఎమ్మెల్యేను కలిసిన కమిటీ సభ్యులు

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం

జీడిమెట్ల, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల సభ్యుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఎస్ఆర్‌నాయక్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీగా ఎన్నికైన సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిచారు. ఎమ్మెల్యే వారిని సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గోగినే ని శ్రీనివాసరావు,సెక్రెటరీ మహేందర్‌రెడ్డి, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ వేమూరి మల్లికార్జున్‌రావు, ఉపాధ్యక్షుడు జి.హరిబాబు, వి.సురేందర్‌రెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ పూర్ణచందర్ గుప్తా, జాయింట్ సెక్రెటరీ వర్మ, భాగ్యరావు, సీఎస్ఆర్. శాస్త్రీ, గుబ్బల లక్ష్మీనారాయణ, గోపాల్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

'హోంలోన్ వడ్డీ రేట్లు తగ్గించాలి'

బాలానగర్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): హోమ్‌లోన్ వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే తగ్గించి పేద మధ్య తరగతి కుటుంబాలను ఆదుకోవాలని బాలానగర్ హిందుస్థాన్ ఏరో నాటికల్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) ఐఎన్‌టీయూసీ కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి కర్కనాగరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరోనా సమయంలో హోంలోన్ వడ్డీ రేటు 6.5 శాతం ఉండేదని, ఐదు సంవత్సరాల్లో వడ్డీ రేటు 10 శాతానికి చేరుకుందన్నారు. వడ్డీ రేటు పెరిగినందున దేశంలో 70శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు 6 నుంచి 7 వరకు అదనంగా డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన వివరించారు. అధిక భారంవల్ల కార్మికులు ఆర్థిక సమస్యలతో కొట్టు మిట్టాడుతూ అప్పుల్లో కూరుకుపోతున్నారని ఆవేదనను వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, రిజర్వు బ్యాంకు వడ్డీ రేట్లను తగ్గించి ప్రజలకు ఊరట కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

శాంటా మారియా పాఠశాలకు అరుదైన గౌరవం



అవార్డుతో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లిలోని శాంటా మారియా ఇంటర్నేషనల్ పాఠశాలకు అరుదైన గౌరవం లభించింది. ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో కేంబ్రిడ్జి యూనివర్సిటీ ప్రెస్, అసెస్‌మెంట్స్ స్కూల్స్ కాంక్లేవ్ సౌత్ ఆసియా 2024అవార్డుతో శాంటా మారియా పాఠశాలను సత్కరించింది. ఈ అవార్డును ప్రిన్సిపాల్ రుచిరా ఘోష్ శాంటా మారియా ఇంటర్నేషనల్ స్కూల్ సీఈవో మహేందర్‌రెడ్డి స్వీకరించారు. ఈ ఈవెంట్‌కు దక్షిణాసియాలోని వివిధ దేశాల నుంచి 500మంది హాజరయ్యారు. శాంటా మారియా డివిజన్ హెడ్ రినీ రాయ్ మాట్లాడుతూ శాంటా మారియా ఈ ఈవెంట్‌లో ప్రత్యేకంగా నిలిచిందన్నారు. విద్యార్థులకు సంపూర్ణమైన విద్యను అందించడంలో నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ

కూకట్‌పల్లి, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): ప్రశాంతినగర్ సోనీ కాంప్లెక్స్‌లో ఉన్న రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున కాంప్లెక్స్‌లోని మొదటి అంతస్తులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డ్స్ విభాగానికి చెందిన గది తలుపుల తాళాలు పగులగొట్టి లోపలికి వెళ్లారు. రోజువారీ మాదిరిగానే సిబ్బంది సాయంత్రం తాళాలు వేసి ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. సమాచారం అందుకొన్న అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి రికార్డ్స్ భద్రపరిచే గదిలోకి వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. కార్యాలయంలో సిబ్బందిని విచారించడంతో పాటు చోరీ తీరుపై దర్యాప్తు చేస్తున్నామని కూకట్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ తెలిపారు. ప్రాథమిక విచారణలో భాగంగా ఇప్పటివరకు విలువైన వస్తువులు, దస్త్రాలు ఏమీ పోలేదన్నారు. కొందరు మద్యం మత్తులో తాళాలు పగులగొట్టి ఉండవచ్చని భావిస్తున్నామని ఆయన వివరించారు. సీసీ కెమెరాలను రాత్రి పూట ఆపి వేయడంతో చోరీ జరిగిన తీరుపై ఆధారాలు లభించలేదన్నారు. పూర్తిస్థాయి విచారణ కొనసాగిస్తున్నామని వెంకటేష్ తెలిపారు. కార్యాలయంలో ఎలాంటి విలువైన వస్తువులు, దస్త్రాలు పోలేదని జాయింట్ సబ్ రిజిస్ట్రార్ ఆర్.సతీష్ తెలిపారు.

బస్సులో హాష్ ఆయిల్ తరలిస్తున్న వృద్ధుడి అరెస్ట్

దుండిగల్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బస్సులో హాష్ ఆయిల్‌ను తరలిస్తున్న వృద్ధుడిని దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విశాఖపట్నం, అనకాపల్లి ప్రాంతంలోని నిదానందొడ్డి, బుద్ద సూర్యారావు వీధిలో నివాసముండే కుర్రు శంకర్‌రావు(71) గురువారం గండిమైసమ్మ చౌరస్తాలో బస్సు దిగి అనుమానాస్పదంగా కనిపించగా దుండిగల్ పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా, అతడి నుంచి 944గ్రాముల హాష్ ఆయిల్, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



చర్చిగాగిల్లాపూర్‌లో ఎక్స్‌కవేటర్‌తో అక్రమ నిర్మాణాలను కూల్చి వేయిస్తున్న తహసీల్దార్ మతిన్



గోపన్‌పల్లిలో ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

దుండిగల్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): గండిమైసమ్మ దుండిగల్ మండల పరిధి చర్చిగాగిల్లాపూర్ సర్వే నంబర్ 214లో వెలుస్తున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ గురువారం కూల్చి వేయించారు. గతంలో ఉన్న ఆర్ఐ బదిలీ కావడం, ఆమె స్థానంలో వచ్చిన నూతన ఆర్ఐ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కబ్జాదారులు సర్వేనంబర్ 214లో ఇళ్ల మధ్యలో ఉన్న స్థలాల్లో అక్రమ నిర్మాణాలకు తెర లేపారు. ఈ విషయంపై ఫిర్యాదు అందుకున్న తహసీల్దార్ మతిన్ ఆర్ఐ భారతి, రెవెన్యూ సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో అక్కడున్న ఒక రూమ్, మూడు బెసిమెంట్లను కూల్చివేశారు.

గోపన్‌పల్లిలో..

రాయదుర్గం, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): గోపన్‌పల్లి పెద్దచెరువు శిఖం, ప్రభుత్వ స్థలంలో సుమారు ఎకర ప్రభుత్వ భూమిని కబ్జాచేసి చేపట్టిన అక్రమ నిర్మాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాంబాబు సిబ్బందితో కలిసి ఎక్స్‌కవేటర్ సాయంతో గురువారం కూల్చివేశారు. ప్రభుత్వ భూమి కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని రాంబాబు హెచ్చరించారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దివాకర్, బీజేపీ అధ్యక్షుడు సతీష్

పార్కును కాపాడాలి

నిజాంపేట్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): సాయికృష్ణ కాలనీలోని పార్కు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ చిట్ల దివాకర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో గురువారం కాలనీ వాసులతో కలిసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేరు. గత గ్రామ పంచాయతీ ఉన్నప్పుడే 15 వందల గజాల స్థలాన్ని పార్కుకు కేటాయించారని, కొందరు పార్కు స్థలం తమదంటూ కోర్టు ద్వారా ఆర్డర్ తెచ్చుకొని, రెండు రోజులుగా హంగామా సృష్టిస్తున్నారని, ఈ విషయంలో కమిషనర్ వాస్తవ పరిస్థితులను ప్రజలకు తెలియపర్చాలని డిమాండ్ చేశారు. 4సంవత్సరాలుగా రూ.లక్షలతో పార్కులో సకల సదుపాయాలు కల్పించారని, ఈ మధ్య ప్రైవేట్ వ్యక్తులు పార్కు స్థలాన్ని ఆక్రమించడానికి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకొని ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని కార్పొరేటర్ విన్నవించారు. కమిషనర్‌ను కలిసిన తర్వాత పార్కువద్ద ఆందోళన చేపట్టారు.

మాట ఖచ్చితం.. మనసు సున్నితం



మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదయ్య దంపతులను సత్కరిస్తున్న జేఎన్‌టీయూ బోధన, బోధనేతర సిబ్బంది

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎలక్ట్రికల్ విభాగం ప్రొఫెసర్ యాదయ్య.. కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా అనేక పదవులు సమర్థవంతంగా నిర్వహించారని, ప్రొఫెసర్ యాదయ్య అనేక ఉత్తమ గుణాలు కలిగిన ఆచార్యుల వర్గానికి చెందిన వ్యక్తి అని ప్రిన్సిపాల్ డాక్టర్ నర్సింహారెడ్డి కొనియాడారు. మూడు దశాబ్దాలు ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రొఫెసర్ యాదయ్య గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ప్రొఫెసర్ యాదయ్య ఉద్యోగ సమయంలో ఖచ్చితంగా ఉన్నా, ఆయన మనసు మాత్రం చాలా సున్నితంగానే ఉండేదన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రొఫెసర్ యాదయ్య సమస్యను ముందే పసిగట్టి, దానికి సులువైన పరిష్కారాన్ని చూపగలిగిన ప్రతిభావంతుడని కొనియాడారు. విచక్షణతో వ్యవహరించడం, సమయపాలన పాటించడం ద్వారా మంచి పరిపాలనాధికారిగా పేరు తెచ్చుకున్నారని వీసీ చెప్పారు. ప్రొఫెసర్‌గా పదవీ విరమణకు ముందే టీఎస్‌పీఎస్‌సీ సభ్యుడిగా ఎంపిక కావడం ఆయన పరిపాలన దక్షతకు నిదర్శనమన్నారు. రెక్టార్ విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసి, వారు రూపొందించిన ఆవిష్కరణలకు, వారి ఆలోచనలకు ప్రొఫెసర్ యాదయ్య అండదండలు అందించారని చెప్పారు. రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. మంచి విలువలు కలిగిన ఆచార్యుడిగా ప్రొఫెసర్ యాదయ్య తరువాతి తరం ఆచార్యులకు ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ యాదయ్య మాట్లాడుతూ.. ఈ రోజు తన ఉన్నతిలో యూనివర్సిటీలో పనిచేసిన ప్రతిఒక్కరి సహకారం ఉందని, ఇంతటి అభిమానం చూపినందుకు యూనివర్సిటీ యాజమాన్యానికి, బోధన, బోధనేతర సిబ్బందికి సదా కృతజ్ఞుడిగా ఉంటానన్నారు. సత్కార కార్యక్రమంలో మాజీ రెక్టార్ గోవర్ధన్, కళాశాల ప్రొఫెసర్లు పార్వతి, జయలక్ష్మి, పద్మావతి, భాస్కర్, వివిధ విభాగాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ శ్రీనివాసరావుకు ఔట్‌లుక్ బిజినెస్ అవార్డు



డాక్టర్ శ్రీనివాసరావుకు అవార్డును అందజేస్తున్న ఔట్‌లుక్ ప్రతినిధులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాసరావుకు ఔట్‌లుక్ బిజినెస్ అవార్డు లభించింది. గురువారం నగరంలోని హోటల్ షెరటాన్‌లో జరిగిన ఎడ్‌టెక్ సదస్సులో ఔట్‌లుక్ బిజినెస్ ఎడిటర్ సుచేతన రాయ్, కన్వర్జెన్స్ హెడ్ సయంతన్‌దాస్ గుప్తా చేతుల మీదుగా డాక్టర్ శ్రీనివాసరావు అవార్డు అందుకున్నారు. విద్యారంగంలో సమర్థవంతమైన వ్యక్తులకు ఈ అవార్డును అందజేస్తారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు పరీక్షల నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియల్లో డిజిటల్ టెక్నాలజీ వినియోగం ద్వారా కళాశాలల్లో పర్యావరణ హితమైన వాతావరణాన్ని నెలకొల్పాలన్నారు. తనను ఔట్‌లుక్ బిజినెస్ అవార్డుకు ఎంపిక చేసిన ప్రతినిధులకు, సహకరించిన కళాశాల యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టెక్నాలజీ వినియోగంలో ఐఐటీలతో పోటీపడాలి



మాట్లాడుతున్న వీసీ నర్సింహారెడ్డి, వేదికపై రెక్టార్ విజయకుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, డైరెక్టర్ శ్రీదేవి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో ఐఐటీలు, ఎన్ఐటీలతో పోటీపడేందుకు సన్నద్ధంగా ఉండాలని జేఎన్‌టీయూ విద్యార్థులకు, ఆచార్యులకు వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహా రెడ్డి పిలుపునిచ్చారు. త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై జే-హబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. నూతన పరికరాలను అందించేందుకు పూర్వవిద్యార్థులు సన్నద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, జె-హబ్ డైరెక్టర్ శ్రీదేవి క్యాంపస్ కాలేజీ విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్స్, తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో 14 మంది ఇన్‌స్పెక్టర్లు మల్టీజోన్‌కు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ విధుల్లో భాగంగా రాచకొండ కమిషనరేట్‌లో పనిచేస్తున్న 14మంది ఇన్‌స్పెక్టర్‌లను మల్టీజోన్ 2కు అటాచ్ చేస్తూ సీపీ తరుణ్‌జోషి గురువారం ఆదేశాలు జారీ చేశారు. యాదాద్రి పీసీఆర్ ఆర్. నిరంజన్, కుషాయిగూడ ఎస్‌హెచ్‌ఓ ఎం.మహేష్, ఘట్‌కేసర్ ఎస్‌హెచ్‌ఓ జి.గోవర్ధనగిరి, కుషాయిగూడ డీఐ బి. సాయిప్రకాష్‌గౌడ్, వనస్థలిపురం డీఐ బి.వెంకటయ్య, వనస్థలిపురం ట్రాఫిక్ 1 ఎల్.బాలుచౌహాన్, కుషాయిగూడ ట్రాఫిక్ పి.రఘువీర్‌రెడ్డి, చౌటుప్పల్ ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్.సైదులు, ఎస్ఓటీ 2 ఈ.జంగయ్య, పి.సైదులు, సీసీఎస్ ఎల్బీనగర్ ఎన్. జయరాం, కె.సత్యనారాయణ, సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ టి.కిరణ్‌కుమార్ మల్టీజోన్ 2 ఐజీపీకి రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఫోన్‌కు ఇచ్చే విలువ ప్రాణానికి ఇవ్వండి



కార్యక్రమంలో పోలీసు అధికారులు, కుటుంబ సభ్యులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పగలకుండా ఉండేందుకు స్క్రీన్ గార్డులు, కవర్‌లు వేస్తామని, కానీ బైక్ నడిపే సమయంలో హెల్మెట్ ధరించడంపై శ్రద్ధ లేదని, సెల్‌ఫోన్‌కు ఇచ్చిన విలువ ప్రాణానికి ఇవ్వాలని హైదరాబాద్ ట్రాఫిక్-1 డీసీపీ ఎల్. సుబ్బారాయుడు కోరారు. ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ బేగంపేట, నార్త్‌జోన్ ట్రాఫిక్ పోలీసుల సంయుక్తాధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్ పీజీ కాలేజ్ ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది, వారి పిల్లలకు ఐసీఐసీఐ లాంబార్డ్ ఇన్సూరెన్స్ సహకారంతో ఉచితంగా 400 హెల్మెట్‌లు పంపిణీ చేశారు. డీసీపీ సుబ్బారాయుడు మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనం నడుపుతున్న వ్యక్తితోపాటు పిలియన్ రైడర్‌లు (వెనుక కూర్చున్నవారు) కూడా హెల్మెట్ తప్పనిసరి గా ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపినప్పుడు ప్రమాదం జరిగితే బీమా వర్తించదని గుర్తుచేశారు. నగరంలో దాదాపు 56.9 లక్షల ద్విచక్ర వాహనాలున్నాయని, దాదాపు 18 లక్షల మంది హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం ట్రిపుల్ రైడింగ్ చేసిన వారికి రూ. 1200 జరిమానా, 3 నెలలు డ్రైవింగ్ లైసెన్స్ సస్పెండ్ చేస్తామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ. 5 వేల జరిమానా, 3 నెలల జైలుశిక్ష విధిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పీజీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జె. రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మృదుల, ట్రాక్స్ ఎస్ సొసైటీ ప్రాజెక్ట్ హెడ్ ఆరాధన జైన్, అడిషనల్ డీసీపీ ట్రాఫిక్ ఎస్.రంగారావు, టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు, ఇన్‌స్పెక్టర్ వి.రాంచందర్‌తో పాటు బోయినపల్లి, మారేడ్‌పల్లి, బేగంపేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శివకుమార్ గౌడ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నేతలు

కాంగ్రెస్‌లో చేరిన శివకుమార్‌గౌడ్

బాలానగర్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధికి చెందిన గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పులి శివకుమార్‌గౌడ్ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు సి. హరివర్ధన్‌రెడ్డి సమక్షంలో ఆయన పార్టీలో చేరారు.

పనుల్లో నాణ్యత పాటించాలి



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్

నిజాంపేట్, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ 28, 30 డివిజన్ల పరిధిలో రూ. 10లక్షలతో చేపడుతున్న పైప్‌లైన్ పనులను డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్ గురువారం పరిశీలించారు. హెచ్ఎండబ్ల్యూఎస్ వారి ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో నాణ్యత పాటించి త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనులను పరిశీలించిన వారిలో హెచ్ఎండబ్ల్యూఎస్ లైన్ మ్యాన్‌లు నర్సింహారెడ్డి, మేకల బాలకృష్ణ, మున్సిపల్ ఇంజనీర్ రవి ఉన్నారు.

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండెచప్పుడుగా బిర్యానీ

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): బిర్యానీ ప్యాకెట్ చిన్నదే కానీ అది తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు గుండె చప్పుడుగా మారింది.. అదే తరహాలో ఆర్థిక వ్యవస్థకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) పరిశ్రమలు భారత దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సాయంత్రం నానక్‌రామ్ గూడా లోని ఓ ప్రైవేట్ హోటల్లో అవుట్ లుక్ బిజినెస్ స్పాట్ లైట్ సమర్పించిన ఇండో గ్లోబల్ బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డులు 2024 పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2030 నాటికి 600 మిలియన్ ఉద్యోగాలు అవసరమని అంచనాలు ఉన్నాయని అన్నారు. అభివృద్ధి చెందుతున్న మార్కెట్లో ప్రతి పది ఉద్యోగాల్లో ఏడు ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల నుంచే లభిస్తున్నాయని తెలిపారు. ప్రపంచ వ్యాపారంలో ఎంఎస్ఎంఈలు 90% వాటాను కలిగి ఉన్నాయన్నారు. ఈ పరిశ్రమలు ఉపాధి, జీడీపీ పెరుగుదలకు గణనీయంగా తోడ్పడుతున్నాయని, జీవనోపాదులపై ఆధారపడిన శ్రామిక, పేద మహిళలు, యువత, బలహీన వర్గాలకు ఈ తరహా పరిశ్రమలు చేయూతనందిస్తున్నాయని భట్టి విక్రమార్క వివరించారు. ఎంఎస్ఎంఈ రంగంలో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 20 మందికి ఆయన అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాపర్టీ ట్యాక్స్‌పై 90శాతం వడ్డీ మాఫీ

మియాపూర్: ప్రాపర్టీ ట్యాక్స్‌పై 90 శాతం వడ్డీ మాఫీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు బీజేపీ హఫీజ్‌పేట డివిజన్ నాయకురాలు బోయిని అనుషా మహేష్‌యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 10రోజుల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్, జీహెచ్ఎంసీ బీజేఎల్పీనేత శంకర్‌యాదవ్‌ను కలిసి ప్రాపర్టీ ట్యాక్స్‌పై వడ్డీ మాఫీ చేయాలని విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

బాలానగర్: ఇందిరానగర్‌లో ఈనెల 6న జరగనున్న బస్తీ సంక్షేమ సంఘం ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం ముగిసింది. అధ్యక్ష పదవికి ఐదుగురు, జనరల్ సెక్రెటరీ పదవికి ఐదుగురు, కోశాధికారి పదవికి నలుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను బస్తీ ఎన్నికల చైర్మెన్ నర్సింహరెడ్డికి అందజేశారు. నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ, శుక్రవారం అభ్యర్థుల ఉప సంహరణ తర్వాత ఎన్నికల బరిలో నిలుస్తున్న వారి పేర్లు వారికి కేటాయించే గుర్తులను తెలియజేస్తామని తెలిపారు.

'వారంలోపు పనులు చేపట్టాలి'

హైదర్‌నగర్: ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషిగూడ పరిధిలోని ఇంద్రహిల్స్‌లోని సీసీరోడ్డుకు నిధులు మంజూరు కావడంతో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ పరిశీలించారు. వారంలోపు సీసీరోడ్డు పనులు మొదలుపెట్టాలని ఆయన కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు దొడ్ల రామకృష్ణగౌడ్, డివిజన్ గౌరవ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు వేతన ఒప్పందం చేయాలి'

జీడిమెట్ల, ఫిబ్రవరి 29(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల థర్మోకేబుల్ కంపెనీ కార్మికులకు సరైన వేతన ఒప్పందం చేయాలని గురువారం యూనియన్ నాయకులు చింతల నాగరాజు ఆధ్వర్యంలో కంపెనీ యాజమాన్యానికి డిమాండ్ పత్రం అందజేశారు. ఏప్రిల్‌లో అగ్రిమెంట్ చేయాల్సి ఉందని దీనిని దృష్టిలో పెట్టుకొని కంపెనీ కార్మికులకు సరైన న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత యూనియన్‌పై ఉందన్నారు. 240రోజులు దాటిన ప్రతి కార్మికుడిని పర్మినెంట్ చేయిస్తానని నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఫిలిప్స్, జనరల్ సెక్రెటరీ వెంకటరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి'

పేట్‌బషీరాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): కొంపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మెన్ సన్న శ్రీశైలంయాదవ్ అన్నారు. బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి రూ. 2314.32 లక్షల అంచనా ఆదాయంతో, రూ. 2076.86లక్షల అంచనా వ్యయం, రూ. 237.46లక్షల మిగులు బడ్జెట్‌ను చైర్మెన్ ప్రవేశపెట్టారు. కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించింది. ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సహకారంతో అభివృద్ధి చేశామన్నారు. కమిషనర్ శ్రీహరి, వైస్‌చైర్మెన్ గంగయ్యనాయక్, ఏఈ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.